క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో శనివారం వృద్ధులు, వికలాంగులు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రామకృష్ణ సేవా సమితి చైర్మన్ ముమ్మనేని భానుమతి మాట్లాడుతూ 2008లో రామకృష్ణ పరమహంస స్ఫూర్తితో సంస్థను ప్రారంభించామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కుర్రా శ్రీను, నరేంద్ర, సీహెచ్.శ్రీను, శివ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

12న తెనాలిలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం

తెనాలిఅర్బన్: క్విట్ఇండియా ఉద్యమంలో అమరులైన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునేందుకు ఈనెల 12వ తేదీన తెనాలి రణరంగచౌక్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓవర్ బ్రిడ్జి సమీపంలోని అమరవీరుల స్థూపాలకు ఉదయం 9 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం సమావేశం జరుగుతుందని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్యఅతిథులుగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి, సమాచార సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా, మున్సిపల్ ఆర్డీ సూర్యదేవర హరికృష్ణ, తదితరులు పాల్గొంటారని చెప్పారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని సత్కరించనున్నట్లు వివరించారు. అందరూ పాల్గొనాలని కోరారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి



తెనాలిఅర్బన్: ఆదివాసీల సమస్యల పరిష్కారానికి జై భీమ్ ఫెడరేషన్ కృషి చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కఠెవరపు దేవయ్య పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివాసీల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం జై భీమ్ ఫెడరేషన్ అనుబంధ ఆదివాసీల సంఘ అధ్యక్షులుగా పేరం అరుణ, కార్యదర్శిగా దూసరపు లావణ్య, పొట్లూరు శ్రీధర్, న్యాయ సలహాదారుడుగా దారా కిషోర్, అమృతలూరు మండల అద్యక్షుడు దేవరకొండ రవిలను నియమించి వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ మేనేజర్ కొత్తపల్లి రవీంద్రబాబు, డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, బేతాళ భూషణం తదితరులు పాల్గొన్నారు.

హామీతో నిరసన విరమించిన కార్మికులు



మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఎం బుక్ కార్మికుల సంఘటితంగా పోరాటం చేసి విజయం సాధించారని సీఐటీయూ నాయకులు వి.వి. జవహర్‌లాల్ అన్నారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో శనివారం రాత్రి ఎం బుక్ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడుతూ ఎం బుక్ కార్మికుల శ్రమ దోపిడీని నిరసిస్తూ ఏడు రోజులు ఆందోళన చేసి విజయం సాధించినట్లు చెప్పారు. సంఘటితంగా ఉంటే ఎంతటి సమస్య అయినా పరిష్కారం అవుతుందని తెలిపారు. కాంట్రాక్టర్ నెలకు రూ. 11,000 వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, నెలకు నాలుగు రోజులు సెలవులు కూడా ఇస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో కార్మికులు నిరసన విరమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మంగళగిరి పట్టణ నాయకులు పుణ్యవతి, రజని పాల్గొన్నారు.

శ్రావణ పౌర్ణమి వేడుకలు



శ్రీఅష్టలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు



శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం



శ్రీబాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక అలంకారం



శ్రీగంగాపార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో..

శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక అలంకారాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. - తెనాలి

మంత్ర అంతర్భాగ ఆగమమే వైఖానస ఆగమం

- శ్రీనివాస మంగాపురం ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు
- ఆగమధురీణ బిరుదు ప్రదానం



బాలాజీ రంగాచార్యులుకు ఆగమధురీణ బిరుదుతో సత్కారం

తెనాలి: మంత్ర అంతర్భాగ ఆగమమే వైఖానస ఆగమం అని టీటీడీ పరిధిలోని శ్రీనివాస మంగాపురం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ దీవి బాలాజీ రంగాచార్యులు అన్నారు. శ్రీ వైఖానస సేవా సంఘం, తెనాలి ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ గోవర్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న విఖనస ఆచార్యస్వామి 66వ వర్ష వర్ధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సభకు సంఘ అధ్యక్షుడు ఎం శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథి బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ శ్రావణ పూర్ణిమనాడు నైమిశారణ్యంలో శ్రీమహావిష్ణువు వేదనారాయణుడిగా ఆవిర్భవించి రాశిగా ఉన్న వేదాన్ని మధనం చేసి విభజించి లోకానికి అందించారని తెలిపారు. వేదాన్ని విభజించిన ఆ స్వామికి విఖనసుడు అనే పేరొచ్చిందని చెప్పారు. ఆయన జయంతి రోజున ఉపనయన సంస్కారం చేసుకోవడంతోపాటు వేదాధ్యయనానికి అర్హత పొందడం, నూతన యజ్ఞోపవీత ధారణ చేస్తారని తెలిపారు. ఇదే రోజున రక్షాబంధన్ ఉత్సవాన్ని జరుపుకోవడం ద్వారా జగద్రక్షకుడైన విష్ణువు రక్ష కలుగుతుందని హైందవ సంస్కృతిలో ప్రగాఢమైన విశ్వాసమని చెప్పారు. వైఖానస సేవా సంఘం తెనాలి సంస్థ కేవలం సేవా కార్యక్రమాలే కాకుండా సంక్షేమాన్ని కూడా చేపట్టటం అభినందనీయమన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారిణి వీఎస్ మల్లేశ్వరి, సంఘ ప్రధాన కార్యదర్శి వేదాంతం మాధవకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.రఘు, వైఖానస యువ విభాగం అధ్యక్షుడు డాక్టర్ నారాయణ రాఘవకృష్ణ అనిల్‌కుమార్, కోశాధికారి యోగానంద చక్రవర్తి, వీఎల్ఎండీ భట్టాచార్యులు ప్రసంగించారు. ఇదే సభలో బాలాజీ రంగాచార్యులకు పండిత సత్కారంతోపాటు వైఖానస ఆగమధురీణ బిరుదును ప్రదానం చేశారు కొలకలూరు చెన్నకేశవ స్వామి ఆలయం వంశపారంపర్య అర్చకుడు దీవి రామాచార్యులను అర్చక పురస్కారంతో, తిరుమల ధర్మగిరి వేద పాఠశాల విద్యార్థి దీవి కృష్ణవంశీని ఆగమ విద్యార్థి పురస్కారంతో సన్మానించారు. వైఖానస యువ విభాగం ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. టి.యశ్వంత్, ఆర్.ఆనందకృష్ణ, టి.కృష్ణమాచార్యులు, టి హరిబాబు తదితరులు సంఘ అభివృద్ధికి సూచనలు చేశారు స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి పట్టణంలో రథోత్సవం జరిపారు. తది ఆరాధన నిర్వహించారు. సబ్ డివిజన్లోని ఎనిమిది మండలాల నుంచి వైఖానస కుటుంబీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యతోనే మంచి భవిష్యత్



తెనాలిటౌన్: విద్యతోనే మంచి భవిష్యత్ సాధ్యపడుతుందని పేదరికాన్ని జయించగలమని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి బి.ఆనంద్‌కిరణ్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని చొప్పర రత్నకుమారి ట్యూషన్‌లోని పేద విద్యార్థులకు ఆనంద్‌కిరణ్ సహకారంతో శనివారం నోటుబుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఈ సుదర్శన్, రావూరి శ్యామ్‌సుందర్, పీఈటీ కె.మోజెస్, రావూరి భరద్వాజ పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో మెగా మెడికల్ క్యాంప్



తెనాలిటౌన్: సూపర్‌స్టార్ మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా శనివారం రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో ఆంధ్ర హాస్పటల్స్ ఆధ్వర్యంలో మెగా మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడిసిన్, సర్జరీ, పిల్లల వైద్యులు, గుండె జబ్బుల వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆంధ్ర హాస్పటల్ డైరెక్టర్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.వి.రామారావు మాట్లాడుతూ మహేష్‌బాబు దత్తత గ్రామమైన బుర్రిపాలెంలో ఇప్పటి వరకు 45 మెడికల్ క్యాంప్‌లు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మోడల్ హెల్త్ విలేజ్‌గా తీర్చిదిద్దాలనే సకల్పంతో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ ముదసిర్, డాక్టర్ శిరీష, డాక్టర్ అమర్, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

మహనీయుడు ఫణికుమార్



తెనాలిటౌన్: అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహనీయుడు కళ్లేపల్లి ఫణికుమార్ సేవలు చిరస్మరణీయమని అర్చక సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.అనంతాచార్యులు పేర్కొన్నారు. శనివారం స్థానిక గోవర్ధనస్వామి దేవాలయంలో ఫణికుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అర్చక సమాఖ్య ఉపాధ్యక్షునిగా ఫణికుమార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా అర్చకుల సంక్షేమం కోసం ఫణికుమార్ అలుపెరుగని పోరాటం చేశారని చెప్పారు. కార్యక్రమంలో టి.రఘు, హరిబాబు, పి.సుబ్బారావు, భాష్యం శేషుకుమార్, శ్రీకాంత్, కేసవ, యశ్వంత్, చక్రవర్తి, శ్రీనివాసరావు, యోగానంద చక్రవర్తి, పాల్గొన్నారు.

రోటరీ సేవలపై విస్తృత ప్రదర్శన



గాంధీచౌక్‌లో ప్రదర్శనలో రోటరీ బాధ్యులు

తెనాలి: రోటరీ ప్రచార కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శనివారం క్లబ్ సభ్యులు పట్టణంలో ప్రదర్శన చేశారు. రోటరీలో కొత్త సభ్యులను చేర్చుకోవటం, కొత్తగా క్లబ్బులు ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ ప్రదర్శన నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజసేవపై ఆసక్తి కలిగిన వివిధ రంగాల ప్రజలు రోటరీలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలనకు రోటరీ ఇంటర్నేషనల్ చేస్తున్న అద్భుత సేవను గుర్తుచేశారు. అంతేకాకుండా సమాజంలో వివిధ రకాలైన వ్యక్తులు, విద్యార్థులకు అవసరమైన వసతుల ఏర్పాటుకు, మహిళల స్వాలంబనకు, పర్యావరణ పరిరక్షణతో సహా పలు రకాల సేవలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగతంగా కన్నా సామూహికంగా చేసే సేవకు ఫలితం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రదర్శనలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, మెంబర్‌షిప్ చైర్ మల్లాది అర్జున, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ డి రవీంద్రనాథ్, వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, గుమ్మడి ప్రసాద్, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రామాయణం అంతట సీతారాముల దాంపత్య ఔన్నత్యం



మాట్లాడుతున్న నరసింహాచార్యులు

నగరంపాలెం: రామాయణం అంతట సీతారాముల దాంపత్య ఔన్నత్యం కనిపిస్తుందని డాక్టర్ మరుధూరి నరసింహా చార్యులు అన్నారు. ఏటీ అగ్రహారం కంచి కామకోటి పీఠ శంకర, గాయత్రీ, దత్తసాయి, సత్యదేవ మందిరం(గాయత్రీ మాతా మందిరం)లో సంస్కృత భారతీ ఆధ్వర్యంలో సంస్కృత సప్తాహం శనివారం నిర్వహించారు. రామాయణం- దాంపత్యం అనే అంశంపై డాక్టర్ మరుధూరి నరసింహా చార్యులు మాట్లాడుతూ సీతాదేవికి దండకారణ్య కష్టంగా ఉండరాదని రాముడు ప్రయత్నించగా, సీత తన భర్తను ఒప్పించి అరణ్యానికి బయలుదేరిందని అన్నారు. ఎంత కష్టమైనా దంపతులు సుఖంగా అనుభవిస్తారని పేర్కొన్నారు. అరణ్యకాండలో దంపతులు చక్కని జీవితాన్ని గడిపారని చెప్పారు. అనసూయాదేవి సీతకు దాంపత్య ధర్మాలను తెలియజేసిందని అన్నారు. లోకానికి దాంపత్య వైభవాన్ని తెలియజేసిన గ్రంథం రామాయణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్కృత భారతీ గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.సుబ్బారావు, గర్నేపూడి రాధాకృష్ణ, బృందావని, డాక్టర్ పెసల దేవేంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న కమలారమణి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రి మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. కీర్తన ఆర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు(హైదరాబాద్) విద్వాన్ డాక్టర్ కమలారమణి శాస్త్రీయ సంగీత కచేరి, డాక్టర్ ఎం.శ్రీధర్, కీర్తన ట్రస్ట్ అధ్యక్షులు ఎం.విజయలక్ష్మి, డాక్టర్ ఎం.సుమిత్ర, ఆలయ పాలకమండలి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. త్యాగరాజ కీర్తనలు, వాగ్గేయ కార కృతులను కమలారమణి శ్రావ్యంగా గానం చేశారు. వయోలిన్‌పై పి.నందకుమార్, మృదంగంపై బి.సురేష్ బాబు వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. త్రీ టౌన్ ఎస్ఐ కరీముల్లా కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటకు చెందిన నారా లక్ష్మి(40) భర్త రామ్మోహనరావు మూడు నెలల కిందట అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆయన గతంలో చేసిన అప్పుల వారు లక్ష్మికి నోటీసులు పంపి అప్పులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. వైద్యశాల నుండి రాత్రికి వచ్చిన సమాచరం, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరపాలి



తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో కూటమి ప్రభుత్వం చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి, మద్దతు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన తాడేపల్లి సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అసమర్ధుల చేతిలో పెట్టి అస్తవ్యస్తం చేసిందని తెలిపారు. 333 మంది కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని, యజమాని కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, సూర్య ప్రకాశరావు, నాగేశ్వరరావు, కార్మికులు ఇమాంబి, శారమ్మ, శివకుమారి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌కు రాఖీలు కట్టిన మహిళా నేతలు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మహిళా నేతలు శనివారం రక్షాబంధన్ వేడుకను జరిపారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఆహ్వానించి, ఆయనకు రాఖీలు కట్టారు. శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన్నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మున్సిపల్ కౌన్సిలర్లు కొర్ర యశోద, పెదలంక లక్ష్మీలావణ్య, మహిళా నేతలు మన్నవ శాంతిశ్రీ, కొంగర మంజీర, షేక్ జకీరా, షేక్ ఇస్రత్ తదితరులు పాల్గొన్నారు. కొల్లిపర: రాఖీ పౌర్ణమి వేడుకలు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సోదర సోదరీమణుల అనుబంధం, అనురాగం, ప్రేమాప్యాయతలకు ప్రతీకగా ఏటా శ్రావణమాసంలోని పౌర్ణమి తిదినాడు ఈ రాఖీ పండుగ జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. అక్కా చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని, ఆపదలో అండగా నిలుస్తామని సోదరులు భరోసానిచ్చారు. ఊరూరా జరిగిన రక్షాబంధన్ సంబరాలతో పండుగ వాతావరణం నెలకొంది.

పసుపు రైతుల కోసం ఫార్మర్-చాట్ యాప్

డిజిటల్ గ్రీన్ రీజినల్ కో-ఆర్డినేటర్ మస్తాన్‌వలి



మాట్లాడుతున్న మస్తాన్‌వలి

కొల్లిపర(తెనాలి): పసుపు పంట సాగుచేసే రైతుల కోసం ఫార్మర్ చాట్ యాప్‌ను రూపకల్పన చేసినట్టు డిజిటల్ గ్రీన్ రీజినల్ కో-ఆర్డినేటర్ మస్తాన్‌వలి వెల్లడించారు. రైతులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ 2025-26 కార్యక్రమంలో భాగంగా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శనివారం కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో రైతులకు పసుపు సాగు, సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యాలపై శిక్షణనిచ్చారు. సంఘం డైరెక్టర్ ఉయ్యూరు సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. డిజిటల్ గ్రీన్ రీజినల్ కో-ఆర్డినేటర్ మస్తాన్‌వలి రైతులకు ఫార్మర్ చాట్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. 40 మంది రైతులకు ఇన్‌స్టాల్ చేశారు. ఉద్యాన పంటలోని వివిధ పథకాలపైన ఉద్యానశాఖ అధికారి నిత్య, వీహెచ్ఓ నాగమణి మాట్లాడారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

దురఅలవాట్లకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

తెనాలిఅర్బన్: విద్యార్థులు దుర అలవాట్లకు దూరంగా ఉండాలని నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. నాజరుపేటలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో శనివారం వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ప్రతి రోజూ తీసుకోవాలని సూచించారు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. తరచూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో వసతి గృహ సంక్షేమాధికారి జెట్టి మరియరాజు, ఏఎన్ఎంలు, మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోండి

తహసీల్దార్ గోపాలకృష్ణ



మెడల్స్ అందుకున్న విద్యార్థులతో తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిఅర్బన్: క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని తెనాలి తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ పేర్కొన్నారు. సెయింట్ పాల్స్ ఇంగ్లీషు మీడియం ఆధ్వర్యంలో సిక్స్ సెగ్మా చెస్ అకాడమి సహకారంతో మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మానసిక దృడత్వాన్ని పెంపొందించేందుకు చెస్ పోటీలు దోహదపడతాయని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ పాల్స్ స్కూల్ డైరెక్టర్ చావలి అకుల్‌నాథ్, సిక్స్ సెగ్మా చెస్ అకాడమీ డైరెక్టర్ నీరంజన్, చావాలి రాజేంద్రప్రసాద్, ప్రతీక్, నాగూర, కార్తీక్, నాగరాజు, నబీ, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో మరణించినా జీవించవచ్చు



అవయవదానంపై లఘునాటిక ప్రదర్శిస్తున్నట్లు నర్సింగ్ విద్యార్థులు

జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ

గుంటూరు మెడికల్: అవయవదానంతో మనిషి మరణించినా జీవించవచ్చని, తాను మరణిస్తూ మరో పది మందికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. అంతర్జాతీయ అవయవదాన వారోత్సవాల సందర్భంగా శనివారం గుంటూరు జీజీహెచ్‌లో అవయవదానంపై ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నర్సింగ్ విద్యార్థులు అవయవదాన ప్రాధాన్యం తెలిసేలా లఘునాటిక ప్రదర్శించారు. ర్యాలీగా ప్లకార్డులు పట్టుకుని ఆస్పత్రి చుట్టూ ర్యాలీ చేశారు. ఆస్పత్రి శుశ్రుత హాలులో వైద్యులు, వైద్య సిబ్బంది సమావేశమై అవయవదాన ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ అవయవదానంపై ప్రజల్లో అపోహలు, అనుమానాలు ఉన్నాయని, అందువల్లే అనేక మంది చనిపోయిన తరువాత శరీరాన్ని కాల్చడం, లేదా, పూడ్చడం చేస్తున్నారన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు అవయవదాన ప్రాధాన్యాన్ని గుర్తించి అవయవాలు దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు నూతన జీవితాన్ని ప్రసాదించి, అమరులుగా మిగిలిపోతారన్నారు.

అంతరిక్ష విజ్ఞానం అనంతం

గుంటూరు ఎడ్యుకేషన్: అంతరిక్ష విజ్ఞానం అనంతమైనదని స్పేస్ కిడ్స్ ఇండియా సీఈఓ కేశాన్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా- ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయ్ 106వ జయంతి సందర్భంగా ప్రారంభించిన అంతరిక్ష విజ్ఞాన వారోత్సవాల్లో భాగంగా శనివారం అంతరిక్ష విజ్ఞానంపై వెబినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేశాన్ మాట్లాడుతూ అంతరిక్ష జ్ఞానం అందరికీ జిజ్ఞాసను పెంచుతుందని అన్నారు. విశ్వానికి సరిహద్దులు ఉన్నాయా, ఎన్ని నక్షత్రాలు ఉంటాయనే సందేహాలతో పాటు విశ్వంలో ఎక్కడైనా జీవం ఉందా ఇలా ఎన్నో అనుమానాలు, ప్రశ్నలు మనకు వస్తుంటాయని అన్నారు. విశ్వ రహస్యాలు ఛేదించే దిశలో మానవుడు నిరంతరం పరిశోధనలు చేస్తునే ఉన్నాడని తెలిపారు. ఈసందర్భంగా వెబినార్‌లో పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అంతరిక్షంలోకి వెళ్లాలంటే కఠినమైన శిక్షణ అవసరమని, మానసికంగా, శారీరకంగా బలం కలిగి ఉండాలని సూచించారు. మనదేశంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో ముఖ్యంగా బాలికలతో అంతరిక్ష సంబంధమైన అనేక ప్రాజెక్టులు చేస్తూ ఉన్నారన్నారు. ప్రపంచపటంలో మన దేశాన్ని ఇస్రో ఉన్నత స్థానంలో ఉంచుతుందని, విద్యార్థులు హార్డ్‌వర్క్ ద్వారానే ఉన్నత స్థాయికి చేరుతారని చెప్పారు. కార్యక్రమంలో మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.